

పౌర్ణమి పూజలు
కాణిపాకంలోని వరసిద్ధుడి క్షేత్రంలో శనివారం శ్రావణ పౌర్ణమి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. - 8లో



ఆగని ఏనుగుల దాడులు
పులిచెర్ల మండలంలో ఏనుగుల దాడులు ఆగనంటున్నాయి. గత మూడు రోజులుగా పంటలను నాశనం చేస్తున్నాయి. - 8లో



రాష్ట్రంలో అరాచక పాలన
రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలుతోందని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ధ్వజమెత్తారు. - 8లో

న్యూస్‌రీల్

బోయకొండలో చండీ హోమం



న్యాయమూర్తి దంపతులకు ప్రసాదాలు అందజేస్తున్న సిబ్బంది

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శనివారం చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారి ఉత్సవమూర్తిని యాగశాల లో నెలకొల్పారు. ఈఓ ఏకాంబరం తోపాటు ఉభయదారులచేత ప్రత్యేక పూజలు, అర్చన లు, అభిషేక పూజలు నిర్వహించారు. ప్రతినె లా పౌర్ణమి రోజున నిర్వహించే ఈ చండీ హో మ పూజలకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతుంటారు. పాకాల న్యాయస్థానం న్యాయమూర్తి పూర్ణాదేవి దంపతులు హాజరయ్యారు. పూర్ణాహుతి అనంత రం అధికారులు ఉభయదారులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

కేంద్ర బృందం పరిశీలన



లబ్ధిదారులతో కేంద్ర బృందం

పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు సచివాలయం పరిధిలో కేంద్ర ప్రభుత్వం నిధుల ద్వారా అమలవుతున్న పథకాలను జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం శనివారం పరిశీలించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, హౌసింగ్, పింఛన్లు, స్వయం సహాయక సంఘాల రుణాల మంజూరుపై లబ్ధిదారులతో చర్చించింది. నేరుగా లబ్ధిదారులకు పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీసింది. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సలహాలు సూచనలు ఇవ్వాలని కోరింది. స్పందించిన స్థానికులు ఉపాధి హామీ పనులు చేయడానికి పనిముట్లు ఇవ్వాలని, దినసరి వేతనం పెంచాలని తమ అభిప్రాయాలను తెలియజేశారు. జాతీయ స్థాయి పర్యవేక్షణ కమిటీ అధికారులు సునీల్, మణికంఠన్, ప్రశాంత్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శారదాదేవి, సర్పంచ్ రమేష్ బాబు, ఏపీఓ మురుగేషన్, ఏపీఎం నీరజ, పంచాయతీ కార్యదర్శి బాలాజీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కోటా డీఎస్సీ పోస్టుల ప్రాథమిక జాబితా విడుదల

తిరుపతి సిటీ: మెగా డీఎస్సీలో క్రీడా కోటా ఉపాధ్యాయ పోస్టుల ప్రాథమిక జాబితాను శాప్ అధికారులు వెబ్‌సైట్‌లో ఉంచారు. జిల్లాలో స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన అభ్యర్థులు శాప్ విడుదల చేసిన జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి 12 గంటల్లోపు తమ అభ్యంతరాలను తెలియజేయాల్సి ఉంటుంది. అభ్యంతరాలు పరిష్కరించిన అనంతరం తుది జాబితాను విద్యాశాఖకు పంపనున్నారు. ఇప్పటికే డీఎస్సీ క్రీడా కోటా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తైన విషయం తెలిసిందే.

లబో ట్యాబో!

'ప్రతి పిల్లవాడు ఉన్నతంగా చదవాలి. ప్రపంచంతో పోటీ పడాలి..' అన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. ఇందులో భాగంగానే ప్రభుత్వ విద్యకు వెన్నుదన్నుగా నిలిచింది. సాంకేతిక విద్యపై విద్యార్థులు మక్కువ పెంచుకునేలా చర్యలు చేపట్టింది. కోట్ల రూపాయలు వెచ్చించి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఉచితంగా అందజేసింది. వీటి ద్వారా విద్యార్థులు సమోన్నతంగా ఎదిగేలా కృషి చేసింది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. పనిచేయని ట్యాబ్‌లతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తలలుపట్టుకోవాల్సి వస్తోంది.



గత ప్రభుత్వ హయాంలో ట్యాబ్‌లతో బోధన

గత ప్రభుత్వంలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

- ప్రస్తుతం పట్టించుకోని కూటమి నేతలు
- సాఫ్ట్‌వేర్ సమస్యలతో పనిచేయని ట్యాబ్‌లు
- మండిపడుతున్న తల్లిదండ్రులు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని పూర్తిగా తుడిచిపెట్టేసేందుకు కుయుక్తులు పన్నుతోంది. హుందాగా వ్యవహరించాల్సింది పోయి దిగజారుడు రాజకీయాలకు తెరదీస్తోంది. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను అందజేసింది. 2022–23వ సంవత్సరం నుంచి వరుసగా రెండేళ్ల పాటు ట్యాబ్‌లు ఉచితంగా పంపిణీ చేసింది. ఆ ట్యాబ్‌ల ద్వారా అత్యాధునిక సాంకేతికతతో బోధించేవారు. పిల్లలు కూడా కూలంకషంగా నేర్చుకునేవారు. రోజూ పాఠశాలకు తీసుకొచ్చి తరగతి గదిలో టీచర్లు బోధించే పాఠ్యాంశాలను విని.. తిరిగి సాయంత్రం ఇంటికి వెళ్లేటప్పుడు తమతో పాటు ట్యాబ్‌లను తీసుకెళ్లేవారు. పాఠశాలల్లో ట్యాబ్‌ల వినియోగానికి ఇంటర్నెట్ సదుపాయం కూడా కల్పించారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నారు. కనీస పర్యవేక్షణ, సాఫ్ట్‌వేర్ అప్డేట్ లేకపోవడంతో అవి మూలన పడాల్సిన దుస్థితి ఏర్పడింది.

లీప్ యాప్‌లో వీడియోలు

ఇటీవల కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న లీప్ యాప్‌లో వీడియోలను రూపొందించి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ఆ వీడియోల పాఠాలను టీచర్లు తరగతి గదిలో డిజిటల్ ప్యానల్ టీవీ ద్వారా బోధిస్తున్నారు. అయితే ట్యాబ్‌ల విషయం మరిచిపోయారు. అంతేగాక ట్యాబ్‌లలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయకపోవడంతో చాలావరకు పనిచేయడం లేదు. కొన్ని అసలు ఆన్ కావడం లేదు. ఎక్కడైనా టీచర్లు చొరవ తీసుకుని ట్యాబ్‌ల ద్వారా బోధిద్దామని యత్నించినా సాఫ్ట్‌వేర్ అప్డేట్ కాక పనిచేయడం లేదు. ట్యాబ్‌లను సరఫరా చేసిన టెక్నీషియన్‌లు పర్యవేక్షించే విభాగాన్ని మూసివేయడంతో అసలు పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీనిపై విద్యావేత్తలు, తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

ఒక్కో ట్యాబ్‌కు రూ.30 వేలు ఖర్చు

జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వంలో రెండేళ్లపాటు ఒక్కో ఏడాదిలో 21,022 మంది విద్యార్థుల చొప్పున 42,044 మందికి ఉచితంగా ట్యాబ్‌లను అందజేశారు. ఇందులో బైజూస్ కంటెంట్‌తో కూడిన వీడియోలను పొందుపరిచారు. ఇవి పదో తరగతి వరకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దారు. ఇందుకోసం ఒక్కో ట్యాప్‌పై సుమారు రూ.30 వేల దాకా ఖర్చుచేశారు. 2023–24లో ఎనిమిదో తరగతి చదివే సమయంలో ట్యాబ్‌లు తీసుకున్న విద్యార్థులు ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నారు. తమ వద్ద ఉన్న ట్యాబ్‌లు సాఫ్ట్‌వేర్ సమస్యలతో మొరాయిస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. సమస్యను టీచర్లు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి స్పందన లేదు.



గత వైఎస్సార్‌సీపీ పాలనలో విద్యార్థులకు అందజేస్తున్న ఉచిత ట్యాబ్‌లు (ఫైల్)

జిల్లా సమాచారం

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు –	1,923
ప్రాథమికోన్నత పాఠశాలలు –	181
ఉన్నత పాఠశాలలు –	330
మొత్తం పాఠశాలలు –	2,434
1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు –	1,31,754
రెండేళ్ల పాటు విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లు –	42,044
ఖర్చు చేసిన మొత్తం –	రూ.126.13 కోట్లు
ప్రస్తుతం పనిచేయని ట్యాబ్‌లు –	13,458

పర్యవేక్షించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఇచ్చిన విలువైన ట్యాబ్‌లు ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ సమస్యతో పనిచేయడం లేదు. గత ప్రభుత్వం ఆ ట్యాబ్‌లను ఇవ్వడంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి. విద్యాభివృద్ధి విషయంలో పర్యవేక్షణ లోపం ఉండడం సరైన పద్ధతి కాదు. వెంటనే ట్యాబ్‌లకు మరమ్మతులు చేయాలి.

– శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి

విద్యార్థులకు ఉపయోగం



గత ప్రభుత్వం హయాంలో విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లు ఎంతో ఉపయోగకరమైనవి. దేశంలో ఎక్కడా విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చిన పాపానపోలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల అభివృద్ధి కోసం గత ప్రభుత్వం కోట్ల రూపాయాలు ఖర్చు చేసింది. 2023–24 సంవత్సరంలో ట్యాబ్‌లు పొందిన విద్యార్థులు ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్నారు. అయితే వారికి అందజేసిన ట్యాబ్‌లు పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి.. వాటిని సరిచేయించాలి.

– హేమారెడ్డి, రిటైర్డ్ హెచ్ఎం, కత్తెరపల్లి గ్రామం, కార్వేటినగరం మండలం

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- గిరిజనులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టరేట్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం
- ఏ సమస్య వచ్చినా నన్ను నేరుగా కలవొచ్చు
- కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ వెల్లడి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గిరిజనులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనులు తమ పిల్లలను తప్పనిసరిగా చదివించుకోవాలన్నారు. ఆదివాసీ యువత తమ సంప్రదాయ, సాంస్కృతిక మూలాలకు క్రమంగా దూరమవుతున్నారన్నారు. జిల్లాలో 50 వేల జనాభా గిరిజనులున్నట్లు తెలిపారు. దాదాపు 600 నివాస ప్రాంతాలలో మౌలిక వసతులను గుర్తించామన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మౌలిక వసతుల పెంపునకు రూ.75 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. గిరిజనులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తనను నేరుగా కలువవచ్చని తెలిపారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి మాట్లాడుతూ గిరిజనులు అటవీ ప్రాంతాల్లో సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేస్తామన్నారు. ఇంటి పట్టాలు లేని గిరిజనులు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గిరిజనులకు ఎటువంటి సమస్య ఉన్నా జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్ మాట్లాడుతూ గిరిజనులు తమ పిల్లలను బడికి పంపించి చదివించాలన్నారు. అనంతరం ముగ్గురు గిరిజనులకు రూ.2,20,293 అందించారు. సోమల, తవణంపల్లి మండలాల్లోని 22 మంది గిరిజనులకు 19.99 ఎకరాల భూస్వామ్య పత్రాలను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి, గిరిజన సంక్షేమ సంఘాల నాయకులు మునీంద్రనాయక్, కృష్ణానాయక్, చిరంజీవి, సుబ్బరాజు, దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఉన్నది గాడిదలు కాయడానికా?

మహిళలు, దళితులను కాపాడలేరా?

- రాష్ట్రంలో మహిళలపై లైంగికదాడులు పెరిగిపోయాయి
- ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు రాజ్యమేలుతున్నాయి
- సీపీఐ 24వ జిల్లా మహాసభలో జాతీయ కార్యదర్శి నారాయణ



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నారాయణ

నగరి : 'రాష్ట్రంలో మహిళలు, దళితులను కాపాడలేని ప్రభుత్వం ఉన్నది ఎందుకు.. గాడిదలు కాయడానికా'..? అంటూ సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఘాటు వ్యాఖ్యలు చేశారు. శనివారం బస్టాండు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సీపీఐ 24వ జిల్లా మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన రాష్ట్ర ప్రభుత్వ పాలనపై విరుచుకుపడ్డారు. మహిళలపై తరచూ లైంగికదాడులు జరుగుతున్నాయని, దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని వాపోయారు. ఏ కార్యాలయానికి వెళ్లినా లంచాలు రాజ్యమేలుతున్నట్టు పేర్కొన్నారు. కొండలకు గుండు కొట్టేస్తున్నారన్నారు. కంకర, గ్రావెల్, ఇసుక, మైన్స్ విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్నట్టు ఆరోపించారు. వైఎస్సార్ ఉచిత విద్యుత్ ఇస్తానని హామీ ఇచ్చారని ఆ మేరకు ఉచిత విద్యుత్ సక్రమంగా అమలుచేసినందునే మళ్లీ ఆయనను గెలిపించారన్నారు. నేడు కొన్ని యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అంటున్నా వారు పెట్టే స్మార్ట్ మీటర్లు విష్ణుచక్రాల్లా తిరుగుతున్నట్టు ఆరోపించారు. ప్రజలకు నష్టం చేకూర్చే స్మార్ట్ మీటర్లు పగులగొడతామని హెచ్చరించారు.

బీసీలు, ఎస్సీలకు రాజ్యాధికారం కావాలి

బీసీలు 52 శాతం ఉన్నారని వారికి ఎస్సీలకు కేటాయించినట్లు చట్టసభల్లో రిజర్వేషన్ ఇవ్వాలన్నారు. వెనుకబడిన వర్గాలు ఉన్నది పల్లకీ మోయడానికి మాత్రమే కాదన్నారు. మహాసభలను పురస్కరించుకొని ఓంశక్తి ఆలయం నుంచి బస్టాండు ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి పీ.హరినాథ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, సహాయ కార్యదర్శి టీ.జనార్దన్, నగరి నియోజకవర్గ కార్యదర్శి ఏ.కోదండం, పట్టణ కార్యదర్శి వేలన్, నాయకులు బషీర్ బాషా, మురళి, శేఖర్, సుబ్రమణ్యం, విజయ్, చినరాజ్, ముత్తు, యేసు, సతీష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ స్కానింగ్' అంతేనా?

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

- గుట్టువిప్పని అధికారులు
- ఇందులో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేసేవారే కీలకం
- చిత్తూరు కేంద్రంగా మరిన్ని అక్రమాలు
- రెచ్చిపోతున్న తమిళనాడు నకిలీ డాక్టర్లు



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సరిహద్దు రాష్ట్రాలకు కేంద్ర బిందువుగా.. అక్రమ స్కానింగ్‌లకు నిలయంగా చిత్తూరు నిలిచింది. గర్భిణుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్థానికంగా స్కానింగ్ సెంటర్లు పెట్టి గర్భిణుల వద్ద ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్కానింగ్ చేసి ఆడ బిడ్డ అయితే మొగ్గలోనే తుంచేస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేసే సిబ్బందే వీరికి పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తున్నారన్న అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. వీరి ఆటకట్టించే విధంగా ఇటీవల కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు జారీ చేసినా సంబంధిత అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సరిహద్దు ప్రాంత మహిళలే టార్గెట్

తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చే గర్భిణులను అదునుగా చేసుకుని రెచ్చిపోతున్నారు. సినీ ఫక్కీలో గర్భిణులను కారులో తీసుకొచ్చి స్కానింగ్ చేయిస్తారు. తర్వాత తీసుకొచ్చిన చోటే వదిలేస్తున్నారు. ఇందుకు ఒక్కొక్కరి వద్ద ఫీజుగా రూ.15 వేల నుంచి రూ. 20వేల వరకు తీసుకుంటున్నారు. వీళ్లే అబార్షన్లకు రెఫర్ చేస్తారు. ఇలా రెఫర్ చేసి కమీషన్లు బొక్కేస్తున్నారు. కొందరు అక్రమ స్కానింగ్ సెంటర్ నిర్వాహకులే అబార్షన్లు చేస్తూ రూ.5వేల నుంచి రూ.10వేల దండుకుంటున్నారు. పెళ్లికానివారు గర్భం దాల్చితే వారి నుంచి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది.

జిల్లా కేంద్రంలోనే అధికం

చిత్తూరు జిల్లా కేంద్రమే అక్రమ స్కానింగ్, అబార్షన్లకు నిలయంగా మారింది. దర్గాసర్కిల్, పొన్నియమ్మగుడి వీధి, సుందరయ్యవీధి, సుబేదారు వీధి, కొంగారెడ్డిపల్లి, ప్రశాంత్‌నగర్, సంతపేట ప్రాంతాల్లో అక్రమ స్కానింగ్‌లతో పాటు అబార్షన్లు చేస్తున్నారనే ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. బెంగళూరు నుంచి వచ్చే వారి తాకిడి ఇక్కడ అధికంగా ఉంది. నిబంధనలు పక్కనబెట్టి తేలికగా లింగనిర్ధారణ, అబార్షన్లు చేసుకుని వెళ్లిపోతున్నారు. ఈ కారణంగానే జిల్లాలో ఆడ పిల్లల నిష్పత్తి తగ్గుముఖం పట్టిందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

చేతులు కలిపేసి.. కాసులు కాజేసి

అక్రమ స్కానింగ్ సెంటర్, కొన్ని ప్రైవేటు ఆస్పత్రులతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేసే వైద్య సిబ్బంది చేతులు కలిపారు. కొందరు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మాయమాటలతో గర్భిణులను నమ్మిస్తున్నారు. మొదటి, రెండో కాన్పులో ఆడబిడ్డ పుడితే.. తర్వాత వచ్చే కడుపుపై కన్నేస్తున్నారు. అక్రమ స్కానింగ్‌లకు పంపుతున్నారు. అక్కడ గుట్టుగా స్కానింగ్ చేసి ఆడ, మగ తెలుసుకుంటున్నారు. ఆపై అబార్షన్లకు పంపుతున్నారు. ఇవన్నీ కూడా కొందరు ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు దగ్గరుండి చేయిస్తున్నారు. ఇక గర్భిణులతో ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ కమీషన్లు దండుకుంటున్నారు. ఈ అక్రమ వ్యాపారం పుంజుకోవడానికి వీరే కారణమనే విషయం ఇటీవల కలెక్టర్ సుమిత్‌కుమార్ పట్టుకున్న అక్రమ స్కానింగ్‌తో బట్టబయలైంది.

ముగ్గురే కాదు

అక్రమ స్కానింగ్ విషయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేసే ముగ్గురితో పాటు చాలా మంది పాలు పంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై తీగ లాగితే..డొంక కదులుతోంది. జిల్లా మొత్తం ఈ అక్రమ స్కానింగ్ విషయం గొలుసులా అల్లుకుపోయింది. ఆ శాఖలో పనిచేసే పలువురు ఆశా వర్కర్లు, ఏఎన్ఎంకు లింకులున్నాయి. పట్టణం, పల్లె, మారుమూల ప్రాంతాలు అనే తేడాలేకుండా అక్రమ వ్యాపారం పూర్తిగా విస్తరించింది. పట్టుబడ్డ వారిని కదిలిస్తే.. ఈ మొత్తం వ్యవహారం బయటకొస్తుందని, అయితే ఈ విషయాన్ని పూర్తిగా అణగతొక్కేయడంతో అక్రమ బాగోతం కేసు మలుపులు తిరుగుతున్నాయని వైద్యశాఖలోని పలువురు చర్చించుకోవడం గమనార్హం.

నకిలీ లీలలు

తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఆర్ఎంపీలు, నకిలీ డాక్టర్ల గుట్టును రట్టు చేసి తరిమికొట్టారు. వారంతా సరిహద్దు ప్రాంతామైన చిత్తూరు జిల్లాలో స్థావరాలు ఏర్పరుచుకున్నారు. పలమనేరు, కుప్పం, వి.కోట, శాంతిపురం, గంగాధరనెల్లూరు, చిత్తూరు, పాలసముద్రం, కార్వేటినగరం, నగరి, యాదమరి తదితర మండలాల్లో అడ్డదిడ్డంగా క్లినిక్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో అక్రమ స్కానింగ్ సెంటర్లను సైతం నిర్వహిస్తున్నారు. డాక్టర్లు, రేడియాలజిస్ట్, సిబ్బంది అవతారమెత్తి కాసులు దండుకుంటున్నారు.

వైద్య సిబ్బందిపై చర్యలేవీ

మూడు నెలల క్రితం చిత్తూరు నగరం భరత్ నగర్‌లో అక్రమ స్కానింగ్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ నిఘా పెట్టి పట్టుకున్నారు. అలాగే తిరుపతిలో నెల రోజుల క్రితం మరో అక్రమ స్కానింగ్ బాగోతం వెలుగుచూసింది. ఇవన్నీ కూడా చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేసే ఓ అటెండరే ముందుండి నడిపించాడని ఆ శాఖ కోడై కూస్తోంది. కలెక్టర్ పట్టుకున్న కేసులో అటెండర్‌తో పాటు ఓ ఆశా వర్కర్, ఏఎన్ఎం పాత్ర కీలకమని వారు ఆరోపిస్తున్నారు. పోలీసుల విచారణలో కూడా వీరి హస్తం ఉన్నట్లు తెలిసింది. అయితే వారిపై వైద్య ఆరోగ్యశాఖ నోటీసులిచ్చి జారుకుంది. కలెక్టర్ పిలిచి వారిని తొలగించాలని ఆదేశించినా... ఆ శాఖ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇక జీడీనెల్లూరు మండలానికి చెందిన ఓ ఆశా వర్కర్‌పై మాత్రం చర్యలు తీసుకుని మిగిలిన వాళ్లను వదిలిపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. తిరుపతి జిల్లాలో నిర్వహిస్తున్న అక్రమ స్కానింగ్ సెంటర్‌పై తమిళనాడులోని తిరువణ్ణామలై జిల్లాలో కేసు నమోదైంది. ఈ కేసులో కూడా ఆ అటెండర్ పాత్ర కీలకమని తెలుస్తోంది. .

కూలికొస్తే..కొడుకే పోయాడు!

- పైపులైను గుంతలో పడి రెండేళ్ల బాలుడి మృతి
- కూలి పనుల కోసం వచ్చి కన్నబిడ్డను పోగొట్టుకున్న దంపతులు
- పలగార్లపల్లెలో విషాదం





మృతిచెందిన చిన్నారి మంజు, ప్రమాదానికి కారణమైన కాలువ

చౌడేపల్లె: బుడిబుడి అడుగులు..వచ్చీరాని మాటలు.. బోసినవ్వులతో అందర్నీ మురిపించే ఓ చిన్నారి నీటిగుంతలో పడి మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. ఈ ఘటన చౌడేపల్లె మండలం, కాగతి పంచాయతీ, పలగార్లపల్లెవద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. ఒడిశాకు చెందిన మహేష్, నిషన్ దంపతులు పలగార్లపల్లె వద్దగల ఓ ప్రవేటు హేచరీస్‌లో కూలిపనులు చేసుకుంటూ అక్కడే ఆవరణంలో పిల్లలతో కలిసి ఉంటున్నారు. ఇటీవల పైపులైన్ల కోసం హేచరీస్ ఆవరణలో గుంతలు తీశారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పైపులైన్ కోసం తవ్విన కాలువలో వర్షపు నీరు నిండిపోయింది. కాలువ దాటి అవతలివైపు వేళ్లేందుకు ఒక్కోచోట పైపులు అమర్చి, ఇనుప రేకును వేసి దారిసౌకర్యం ఏర్పాటు చేశారు. రోజువారీగా మహేష్, నిషన్ ఇద్దరూ కోళ్లఫారంలో పనులు చేసుకుంటుడగా ఇంట్లో ఉన్న కుమారుడు మంజు(2) ప్రమాదవశాత్తు పైపులైను కోసం తీసిన కాలువలో పడిపోయాడు. గమనించిన మిగిలిన పిల్లలు కేకలు వేయగా అక్కడే పనిచేస్తున్న తల్లితండ్రులు బయటకు తీసి పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే బాలుడు మంజు మృతిచెందినట్లు నిర్ధారించారు.

రెండేళ్లకే నూరేళ్లు నిండాయా నాయనా?

'నీ కోసం ఊరుగాని ఊరొచ్చి.. కూలిపనులు చేసుకుంటున్నాం. నిన్ను బాగా చూడాలని.. గొప్పగా చదివించాలని కలలుగన్నాం. కానీ ఆ దేవుడు రెండేళ్లకే నా కుమారుడిని తీసుకెళ్లిపోయాడు. ఎందుకింత శిక్ష వేశావు నాయనా..' అంటూ తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ రోదించడం కలచివేసింది. వారిని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు.

హేచరీస్ నిర్లక్ష్యమే కారణమా?

పైపులైన్ల కోసం తీసిన కాలువను సకాలంలో పూడ్చలేదు. దీనికితోడు అక్కడ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. ఈ కారణంగానే బిడ్డ మృతిచెందాడని స్థానికులు ఆరోపించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

క్లుప్తంగా

వరసిద్ధుడి క్షేత్రంలో పౌర్ణమి పూజలు


సత్యనారాయణ వత్రం చేస్తున్న భక్తులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి క్షేత్రంలో శనివారం శ్రావణ పౌర్ణమి పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కల్యాణ వేదికపై ఉత్సవమూర్తికి విశేష పూజలు జరిపించారు. అలాగే కల్యాణోత్సవం, ప్రాకారోత్సవం చేశారు. కార్యక్రమానికి కోదండరాంశెట్టి బ్రదర్స్ ఉభయదారులుగా వ్యవహరించారు. అలాగే శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవరదరాజుల స్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతాన్ని భక్తిప్రపత్తులతో చేపట్టారు.

రాజనాలబండకు పోటెత్తిన భక్తులు


సౌభాగ్యం తాంబూలాన్ని అందజేస్తున్న ఆలయ సిబ్బంది


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

చౌడేపల్లె: సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ మాసపు మూడవ శనివారాన్ని పురస్కరించుకొని భక్తులు పోటెత్తారు. అర్చకులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. ఏటా శ్రావణమాసపు నెలలో చివరి శనివారం, ఆదివారం రోజున పదమూడు గ్రామాల ప్రజలు కలిసి రాజనాలబండలో ఉట్లోత్సవం, తిరుణాల నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మూడవ శనివారపు పూజలు చేయడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ పర్యవేక్షణలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సౌభాగ్యం తాంబూలం పంపిణీ

రాజనాల బండ ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో మహిళలకు సంప్రదాయబద్ధంగా సౌభాగ్యం తాంబూలాన్ని పంపిణీ చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలనంతరం మహిళలకు సుమంగళిగా ఉండాలని, ఆయురోగ్యాలు సుఖ శాంతులతో ఉండాలని ఆశీర్వదిస్తూ పసుపు, కుంకుమ, గాజులతో పాటు మంగళి సూత్రం పంపిణీ చేశారు.

ఆశా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి తుడా: ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు తిరుపతి జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ పథకం కింద పలు పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ పరిధిలో 27 ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య శాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. వయస్సు 25 నుంచి 45 ఏళ్లలోపు ఉన్న మహిళా అభ్యర్థులు ఈనెల 16వ తేదీ లోపు తమ పరిధిలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లకు దరఖాస్తులను అందజేయాలని కోరారు.

రాష్ట్రంలో అరాచక పాలన

బైరెడ్డిపల్లె : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి తెలిపారు. పలమనేరు–కుప్పం జాతీయ రహదారిలోని బైరెడ్డిపల్లె సమీపంలో ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమకేసు నుంచి విముక్తి కలగాలని ఆలయంలో పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని అరాచకాలు, అక్రమ కేసులతో ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయంగా పెద్దిరెడ్డి కుటుంబంపై కక్ష సాధిస్తూ ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టారని ఆరోపించారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యులు ఆర్.కేశవులు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి దయానందగౌడు, వైస్ ఎంపీపీలు, రూపజయకుమార్‌రెడ్డి, నారాయణస్వామి, మండల యూత్ అధ్యక్షుడు మహేష్‌బాబు, సర్పంచులు వెంకటేష్, బాలక్రిష్ణగౌడు, రమణారెడ్డి, చంద్రమౌళి, రాజప్ప, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

ఎంపీ విడుదల కావాలని రాజనాలబండపై పూజలు

చౌడేపల్లె: అక్రమ కేసులో అరెస్టయిన రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని కోరుతూ సత్యప్రమాణాలను నిలయమైన రాజనాలబండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నేతలు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. వెంగళపల్లె ఎంపీటీసీ లక్ష్మీనరసయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు ఓబులేసు, చంద్రశేఖర్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యుల పేరిట అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద 101 కొబ్బరికాయలు కొట్టారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ఎస్.దామోదరరాజు, మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, మాజీ బోయకొండ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, మిద్దింటి కిషోర్‌బాబు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వెంకటరమణ, అమర, సర్పంచులు షంషీర్, ఓబుల్‌రెడ్డి, నాగరత్న, ఎంపీటీసీ శ్రీరాములు, మాజీ సింగిల్ విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, రమేష్‌బాబు, సాధిక్, నాయకులు ఠాణాధార్ నాగరాజ, చెంగారెడ్డి, పవన్‌కుమార్, బాలాజీ, జీఆర్ఎస్ రమణ, సుబ్రమణ్యంరాజు, బీ.భాస్కర్, వెంకటరెడ్డి, అనుప్రియ, శంకరప్ప, గణేష్, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


చౌడేపల్లి: రాజనాలబండలో కొబ్బరికాయలు కొడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కూటమికి మంచి బుద్ధి ప్రసాదించు స్వామీ

సోమల(చౌడేపల్లె): అక్రమ కేసులో అరెస్టయిన ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని కోరుతూ సోమలలోని భూనీలాదేవి సమేత పరష వేంకటేశ్వరస్వామి పాదాల గుడి వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 101 కొబ్బరికాయలు కొట్టారు. ఎంపీపీ ఈశ్వరయ్య, మండల పార్టీ అధ్యక్షుడు గంగాధర్‌రాయల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు అమానమోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రభాకర్, వాటర్‌షెడ్ చైర్మన్లు పుష్పావతి, డిసెంబరు రావు, సర్పంచులు శీలం సిద్ధులమ్మ, వెంకటరమణ, జయరాం, ఎంపీటీసీ నాగభూషణరెడ్డి, నాయకులు శీలం భాస్కర్, సాంబశివయ్య, వరదం రమణ, ఐలా శంకర, శ్రీరాములు, సుబ్రమణ్యం, మురళి, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.


సోమల: ఆలయం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు


సదుంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం నాయకులు

సదుం: అక్రమ కేసులో అరెస్టయిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి విడుదల కోసం మండల కేంద్రానికి చెందిన ముస్లిం మైనారిటీ నాయకులు శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయనకు వెంటనే బెయిల్ మంజూరు కావాలని దువా చేశారు. పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ.. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్నందుకే కూటమి ప్రభుత్వం ఆయనను వేధించేందుకు అక్రమ కేసులు బనాయించిందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ నాయకులను అరెస్టు చేస్తోందన్నారు. మాజీ సర్పంచ్ సయ్యద్ బాషా, ఖమ్రుద్దీన్, ఖాజాపీర్, బావాజీ, కాలేషా, మునాఫ్, షబ్బీర్, ఎంఎం బాషా, అంజాద్, సాదిక్, చాను, రెడ్డి ముబారక్ పాల్గొన్నారు.

ఆగని ఏనుగుల దాడులు


పెనుబాల దళితవాడ వద్ద ధ్వంసమైన అరటితోట

పులిచెర్ల(కల్లూరు): మండలంలో గత మూడు రోజులుగా ఏనుగుల దాడులు ఆగనంటున్నాయి. రైతుల కష్టం నేలపాలవుతూనే ఉంది. శనివారం మండలంలోని గండోలపల్లెచ పెనుబాల దళితవాడ, మిట్టమీద రాచపల్లె, దిగువమూర్తివారిపల్లెల్లోని అరటి, టమాట, పశుగ్రాసం, తోట చుట్టూ ఉన్న కంచె, కూసాలను ధ్వంసం చేశాయి. 16 ఏనుగుల గుంపు పాళెం పంచాయతీ సమీపంలోని చింతలవంక ప్రాంతంలో తిష్టవేసి దాడి చేస్తున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఏనుగుల దాడుల నుంచి పంటలను రక్షించాలని కోరుతున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 70,480 మంది స్వామివారిని దర్శించుకోగా 28,923 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.17 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించబోరని స్పష్టం చేసింది.

'నులి'మేద్దాం రండి!

- 12 నుంచి నులిపురుగు నిర్మూలన కార్యక్రమం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నులి పురుగుల సమస్య పిల్లలను కుంగదీస్తోంది. శారీరక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రక్తహీనతకు గురిచేస్తోంది. ఈ నెల 12న జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1- 19 పిల్లలు 3,62,535 మంది ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు 2,420 ఉండగా 77,318 మంది పిల్లలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 2,883 ఉండగా 2,40,658 పిల్లలు, ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్మీడియెట్ కళాశాలలు 163 గాను 43,402 మంది విద్యార్థులు, బడిబయట పిల్లలు 1,157 మందికి నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నారు. ఈనెల 12న ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాలో గుర్తించిన పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నారు. పంపిణీ కార్యక్రమం ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు కొనసాగనుంది. కాగా 1-2 సంవత్సరాలు గల చిన్నారులకు సగం మాత్ర, 2-3 ఏళ్ల వారికి పూర్తి మాత్ర, 3-19 ఏళ్ల పిల్లలు ఒక మాత్రను నమిలి మింగాలని వైద్యులు చెబుతున్నారు.

చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి

పిల్లలు చేతులు శుభ్రం చేసుకోకుండా భోజనం చేయడం, మట్టిలో ఆడుకోవడం లాంటి కారణాలతో 1- 19 ఏళ్ల వయసు గల పిల్లల కడుపులో నులి పురుగులు తయారవుతాయి. అవి కడుపులో రక్తాన్ని పీల్చడంతో పాటు పిల్లల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. తరచూ అనారోగ్యం బారిన పడడం, బరువు తగడం, ఎత్తుకు తగ్గ బరువు ఉండకపోవడంతో పాటు చురుకుదనం కోల్పోతారు. ప్రస్తుతం ఇలాంటి పిల్లలు అంగన్‌వాడీ సెంటర్లలో అధిక మంది ఉన్నట్లు గుర్తించారు.

విధిగా వేయించాలి



జిల్లాలోని చిన్నారులకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి. విధిగా ఈ కార్యక్రమాన్ని నిర్వర్తించాలి. నిర్లక్ష్యం ఉండకూడదు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నాలి. ముఖ్యమంగా అంగన్‌వాడీ, ఇతర ప్రభుత్వ పాఠశాలలు, వైద్య సిబ్బంది విధిగా హాజరు కావాలి. క్షేత్ర స్థాయిలో కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించాలి.

– సుధారాణి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

ఉద్యోగులకిచ్చిన హామీలు ఏమయ్యాయి?

- మెరుగైన వేతనాలు, డీఏలు ఎందుకు ఇవ్వడం లేదు
- ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు
- మండిపడ్డ రాష్ట్రోపాధ్యాయ సంఘం

నగరి : 'ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి.. సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది'..అని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ ప్రశ్నించారు. శనివారం నగరి పట్టణంలో డివిజనల్ కన్వీనర్ గిరిబాబు అధ్యక్షతన ఎస్టీయూ డివిజన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సకాలంలో డీఏలు ఇస్తామని, మెరుగైన వేతన సవరణ చేస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వం ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. బోధనేతర పనులు మితిమీరి ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. దీని ప్రభావం బోధనపై పడే ప్రమాదం ఉందన్నారు. తెలుగు రాష్ట్రంలో తెలుగు మాధ్యమం తప్పనిసరిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరగొండ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ 2003 టీచర్లకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. పదోతరగతి పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో పాల్గొన్న వారికి ఇంతవరకు పారితోషికం చెల్లించకపోవడం అన్యాయమన్నారు. జిల్లా అధ్యక్షుడు మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ రకరకాల యాప్‌ల పేరుతో టీచర్లు బోధనేతర పనులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్ , ఏపీజీఎల్ఐ ఖాతాల నుంచి రుణాల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఉమ్మడి సర్వీసు నిబంధనల అమలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ నాయకులు నాగభూషణం, రమేష్, బొబ్బిలిరెడ్డి, లక్ష్మీనారాయణ, పురుషోత్తం, మోహన్, సుబ్రమణ్యం పిళ్లై, గుణశేఖర్, అమరనాథ్, వెంకట్, వసంత్, వేణు ప్రసాద్, చిరంజీవి, లక్ష్మీపతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్

జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే ఈ కార్డెన్ సెర్చ్ పేరిట తనిఖీలు చేపట్టారు. నేరాలను ముందస్తుగా గుర్తించి అరికట్టడమే కార్డెన్ సెర్చ్ లక్ష్యమని చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. వాహనాల తనిఖీ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు గుర్తించడం, అసాంఘి కార్యకలాపాలు నిరోధించడానికి ఇలాంటి తనిఖీలు ఉపయోగపడుతాయన్నారు. ఈ తనిఖీల్లో జిల్లాలో సరైన రికార్డులు లేనటువంటి 11 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని, 30 కర్ణాటక మద్యం ప్యాకెట్లను సీజ్ చేశామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని ఏఎస్పీ తెలిపారు.


కల్లూరు సర్కిల్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

గీత దాటిన వెటర్నరీ వీసీ

చంద్రగిరి: శ్రీవేంకటేశ్వర పశువైద్యవిశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ హద్దులు దాటి వ్యవహరిస్తున్నారు. కూటమి సర్కారు పూర్తి స్థాయి వీసీని నియమించకుండా రాష్ట్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. డీన్‌ల స్థాయి నుంచి అధికారుల వరకు గత ఏడాదిగా ఇన్‌చార్జ్‌ల పాలనే కొనసాగుతోంది. దీంతో నిబంధనలకు అనుగుణంగా పూర్తి స్థాయి నిర్ణయాలు తీసుకోలేక, గీతదాటి ఇన్‌చార్జ్‌లు వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటున్నారు. అధికారులు రాజకీయ వైషమ్యాలతో గ్రూపులుగా ఏర్పడి యూనివర్సిటీ ప్రతిష్టను దిగజార్చే పరిస్థితిని తీసుకొచ్చారు. పాలకమండలి లేకపోయినా ఇన్‌చార్జ్ హోదాలో అధికారులు వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడంపై విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రార్ నియామకం

వెటర్నరీ యూనివర్సిటీలో ఆరు నెలల కాల వ్యవధితో బోర్డు అనుమతులు తీసుకుంటామంటూ రిజిస్ట్రార్‌ను నిబంధనలకు విరుద్ధంగా నియమించినట్లు సోమవారం రాత్రి ఆగమేఘాల మీద గుట్టు చప్పుడు కాకుండా ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జ్ వీసీకి కేవలం మూడు నెలల కాల వ్యవధితో మాత్రమే రిజిస్ట్రార్‌ను నియమించే నిబంధన ఉంది. అయితే రాజకీయ ఒత్తిళ్ల కారణంగానో లేక అవగాహన రాహిత్యంతోనో ఆరు నెలల కాల వ్యవధితో రిజిస్ట్రార్‌ను నియమించారు. ఆ హోదాకు అర్హులైన అధికారులు యూనివర్సిటీలో ఉన్నప్పటికీ గన్నవరం నుంచి ఓ ప్రొఫెసర్‌ను ఆ పదవికి దిగుమతి చేసుకోవడం ఏమిటో అర్థం కాలేదని యూనివర్సిటీలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఇన్‌చార్జ్ వీసీ తీసుకుంటున్న నిర్ణయాలతో ఇప్పటికే చాలా వరకు నష్టపోయామని, ఇకనైనా పాలనను గాడిలో పెట్టడానికి పాలకమండలితో పాటు శాశ్వత వీసీను నియమించాలని పలువురు కోరుతున్నారు.